నేటితో ముగియనున్న గాంధీ శిల్పమేళా

150కి పైగా స్టాళ్ల ఏర్పాటు.. ఆకట్టుకుంటున్న హస్తకళా ఉత్పత్తులు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న గాంధీ శిల్పమేళాలో కళాకారులు తయారు చేసిన హస్తకళా ఉత్పత్తులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సూక్ష్మమైన రాతి కళాకృతులు, ఇత్తడితో తయారు చేసిన దేవీదేవతా మూర్తుల విగ్రహాలు, వివిధ రకాల మెటల్‌తో తయారు చేసిన గాజులు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నెలల తరబడి తయారు చేసిన ఆకృతులను నగరవాసులు విరివిగా కొనుగోలు చేస్తున్నట్టు స్టాల్స్ నిర్వాహకులు తెలిపారు. సందర్శకులకు కావాల్సిన ఆకృతులను ఆర్డర్‌పై తయారు చేసి అందిస్తామని తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులకు ఒక్కో ప్రత్యేకత ఉంది. బిద్రి, సిల్వర్ పిలిగ్రి సంప్రదాయ అరుదైన ఉత్పత్తులని తెలిపారు. రామ, రావణ సన్నివేశాలను, రామాయణ ప్రధాన ఘట్టాలను తెలిపే విధంగా చర్మంపై తొలు బొమ్మలు (రాముడు, సీత, లక్ష్మణుడు, రావణుడు) తదితర ఆకృతులను తయారు చేసి స్టాల్స్‌లో అందుబాటులో ఉంచారు. వీటిని కేవలం కొనుగోలుకే పరిమితం చేయకుండా ప్రతి ఇంట్లో ఉంచుకుని వాటి గొప్పతనాన్ని చిన్నారులకు తెలపాలని కళాకారులు కోరుతున్నారు. సంస్కృతి, సంప్రదాయాలను తెలిపే విధంగా ఎన్నో చిత్రాలు, పెయింటింగ్స్‌ను అందుబాటులో ఉన్నాయి.

మేళాలో 150కి పైగా స్టాల్స్‌ను సందర్శకులకు అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా ఉత్తర్‌ప్రదేశ్, వెస్ట్‌బెంగాల్, బిహార్, ఒడిశా, పంజాబ్, జమ్ముకశ్మీర్, రాజస్థాన్, అస్సాం, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి, కర్ణాటక, తమిళనాడు, హర్యానా తదితర రాష్ట్రాలకు చెందిన కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను స్టాల్స్‌లో అందుబాటులో ఉంచారు.

ఆకట్టుకుంటున్న ఉత్పత్తులు....

ఫెరల్స్ జ్యూవలరీ, లెదర్ ఆర్టికల్స్, ల్యాట్ బ్యాంగిల్స్, టెర్రకోట ఉత్పత్తులు, జరీ, జ్యూట్ ఉత్పత్తులు చెరియల్, నిర్మల్, తంజావూరు పెయింటింగ్స్, కొండపల్లి బొమ్మలు, టై అండ్ డై, ఎంబ్రాయిడరీ, హ్యాండ్‌బ్లాక్ ప్రింటింగ్, ఆర్టిఫిషియల్ జ్యూవలరీ, డ్రై ఫ్లవర్స్, వెదురు ఉత్పత్తులు స్టాల్స్‌ల్లో అందుబాటులో ఉంచగా ఇవి ఎంతోగానో ఆకట్టుకుంటున్నాయి.





గాంధీ శిల్ప మేళాలో ఆకట్టుకుంటున్న వెదురు, వివిధ రకాల వైర్‌లతో తయారు చేసిన ఉత్పత్తుల స్టాల్స్, లెదర్ పపెట్ ఉత్పత్తులు



ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న బిద్రి ఆర్ట్ స్టాల్




నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చందానగర్: వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సురక్షా ఫీడర్ పరిధిలో రాజేందర్ రెడ్డి, రోడ్డు నెంబర్ 1, 2, 3, విద్యానగర్, సురక్షా హిల్స్, శుభోదయా కాలనీ, అపర్ణ హెటీ సర్వీస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండన్నారు. అదే విధంగా పాపిరెడ్డి కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో మార్కెడ్ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 01.00 గంటల వరకు సీఎం తోట, నార్నె ఎస్టేట్స్, వైశాలీనగర్, శిల్పా గార్డెన్స్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ దీప్తి పేర్కొన్నారు.

మియాపూర్‌లో...

మియాపూర్: మయూరినగర్, ప్రశాంత్‌నగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ రవిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓల్డేజ్ హోం, మయూరినగర్, ఎస్‌బీఐ బ్యాంకు రోడ్డు విజేత సూపర్ మార్కెట్ రోడ్డు, అదేవిధంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఓల్డేజ్ హోం, ఐసీఐసీ బ్యాంకు రోడ్డు, మయూరినగర్ పార్క్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మయూరినగర్ పార్క్ టెంపుల్ కాంప్లెక్స్, ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్స్, ఆర్‌ఎల్ సీటీ రోడ్డు, ఓల్డేజ్ హోం, ఇందిరమ్మ కాలనీ ఫేస్ –2 కాలనీలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. దీనిని విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

గచ్చిబౌలిలో...

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు గచ్చిబౌలి ఏఈ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఏపీకాలనీ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, జయభేరీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విద్యుత్ సరఫరాలో కలిగే అంతరాయాన్ని గుర్తించి సహకరించాలని ఆయన కోరారు.

త్వరగా రేషన్‌కార్డుల దరఖాస్తులను పరిశీలించాలి

26వ తేదీన నూతన కార్డులు అందజేత : ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి

చందానగర్: 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రేషన్‌కార్డుల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేయనున్నట్లు చందానగర్ సర్కిల్–21 ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన రేషన్ కార్డు ప్రక్రియలో భాగంగా చందానగర్ సర్కిల్–21 ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి అంబేడ్కర్ కల్యాణ మండపంలో దరఖాస్తుల సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తుల ప్రక్రియ పూర్తి అయిన వెంటనే 26వ తేదీన నూతన రేషన్‌కార్డులు జారీ చేస్తామన్నారు. ఇటీవల నిర్వహించిన కులగణన సర్వేలో ఆధారంగా రేషన్‌కార్డు లేని కుటుంబాల జాబితాను పరిశీలన చేయనున్నట్లు పేర్కొన్నారు. సర్కిల్–21 పరిధిలో ఇంటింటికి సర్వే ఆధారంగా మొత్తం 2336 దరఖాస్తులు అందాయని, ఈ దరఖాస్తుల పరిశీలనకు 58 సర్వేయర్లను నియమించడం జరిగిందన్నారు. ఐదు రోజులలో ఈ పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన కూడా దాదాపు పూర్తి కావచ్చిందన్నారు. దళారులను నమ్మవద్దని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన సూచించారు.



సర్వేయర్లతో మాట్లాడుతున్న డీసీ మోహన్‌రెడ్డి

బాక్సింగ్ పోటీల్లో మియాపూర్ యువకుడి సత్తా



క్రిష్ణ కిషోర్‌ను సన్మానిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

మియాపూర్: జాతీయ సౌత్‌జోన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ అండర్ –14 విభాగంలో మియాపూర్‌కు చెందిన క్రిష్ణ కిషోర్ సత్తాచాటాడు. ఈ సందర్భంగా ఎంఏనగర్ ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో సత్తా చాటిన క్రిష్ణ కిషోర్, తల్లిదండ్రులను సన్మానించారు. అనంతరం ఎంసీపీఐయూ నాయకులు మాట్లాడుతూ జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించిన క్రిష్ణ కిషోర్ రానున్న రోజుల్లో జాతీయ స్థాయిలో మరింతగా రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి, ఎంసీపీఐయూ గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి తుడుం అనిల్‌కుమార్, కార్యదర్శివర్గ సభ్యులు ఇస్లావత్ దశరథ్ నాయక్, నాయకులు అంగడి పుష్ప, దానయ్య, రమేష్, శివానీ, సుల్తానాబేగం, విద్యార్థి నాయకులు శ్రీకాంత్, అరుణ్, దస్తగిరి, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి తారతమ్యం లేకుండా సంక్షేమ ఫలాలు

- రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ
- పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



గచ్చిబౌలి: ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని, ఎలాంటి తారతమ్యాలు లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరగాలని ప్రతి పేదవాడికి సంక్షేమ పథకం అందేలా అధికారులు కృషి చేయాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడిగాంధీ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ కులగణన సర్వే ఆధారంగా రేషన్‌కార్డుల జారీ జరుగుతుందని, అందుకు అవసరమైన మార్గదర్శకాలను ప్రభుత్వం ఖరారు చేసిందన్నారు. రేషన్ కార్డుల జారీ అనేది నిరంతరం జరిగే ప్రక్రియ అని ఆయన గుర్తు చేశారు. ఈనెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అధికారుల బృందాలు పర్యటించి అర్హులను గుర్తిస్తాయన్నారు. ఈ నెల 26వ తేదీన కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామని ఆయన గుర్తు చేశారు. ఈ చక్కటి అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పేదలవారు కన్నకల ఇందిరమ్మ ఇళ్లు అని, పేదవారికి భారం లేకుండా ప్రభుత్వం అన్ని రకాల నిర్ణయాలు తీసుకుంటుందని, పేదవారి కలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు.ఇందిరమ్మ ఇళ్ళ మంజూరులో తొలిదశలో సొంత స్థలాలున్న వారికే ప్రాధాన్యమిస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైతే సొంత స్థలం ఉంటారో వారి ఇంటి ఫొటో తీసి యాప్‌లో నమోదు చేస్తారన్నారు. ఈ చక్కటి అవకాశం ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇంటికి మొదటి విడతగా లక్ష రూపాయలు ఇస్తారని, ఎవరు ఇళ్లు వారు నిర్మించుకునే విధంగా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజాపాలనలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని గుర్తిస్తున్నా రన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేయనివారు ప్రత్యేక కౌంటర్లలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు



మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న గాంధీ శిల్ప బజార్‌లో భాగంగా గురువారం నాట్యగురువు చంద్రశేఖర్ శిష్య బృందంచే ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన సందర్శకులను కట్టిపడేసింది. ఇందులో తాండవ నృత్యకారి, బ్రహ్మాంజలి, సరస్వతి కీర్తన, భామకలాపం తదితర అంశాలను కళాకారులు అమూల్య, స్నిగ్ధ, సురభి, మహాలక్ష్మి, వాసుకి, అక్షర, రిత్విక్, వసుధ తదితరులు పాల్గొని నృత్యాభినయంతో ఆకట్టుకున్నారు. అలాగే ప్రణవి తుమ్మాటి శిష్య బృందంచే కూచిపూడి ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. మూషిక వాహన, మీనాక్షి పంచరత్న, గరుడ గమన, ముద్దుగారే యశోద, ఇదిగో భద్రాద్రి అంశాలను కళాకారులు శ్రీవిద్య, సహస్ర, ఆర్షి, సమన్విత, నక్షత్ర, శాన్వి, రితిక తదితరులు ప్రదర్శించి అలరించారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డు హోలిస్టిక్ హాస్పిటల్ వద్ద చేపడుతున్న వరద నీటి కాలువ పనులను గురువారం జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని విభాగాల అధికారులు, ప్రజల సహకారంతో పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానన్నారు. డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం గురువారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ గొట్టిముక్కల నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు సురువు వెంకట్రావు, గంట విద్యాసాగర్, రంగా భాస్కర్ గౌడ్, కృష్ణ, ఏంబరి శ్రీకాంత్, శారద శ్రీనివాస్‌లను ఆలయ ప్రధాన అధ్యక్షులు గోపాల్ శర్మ అభినందించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పారెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ పలువురు వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ కథనం మేరకు.. బుధవారం నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 39 మంది పట్టుబడ్డారు. దీంతో పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 16 మందికి రూ. 2 వేలు, మరో 21 మందికి రూ.1,500, ఒకరికి రూ.1,000 జరిమానా విధించారు. మరో వ్యక్తికి జరిమానాతోపాటు రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఒకరు జైలుకు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో వారంరోజులుగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఇందులో మద్యం తాగిన ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

టీకన్సల్ట్‌తో సమగ్ర ఆరోగ్య సేవలకు ఆస్కారం

- వినూత్న ఆలోచనకు 100కు పైగా వైద్య నిపుణులు తోడ్పాటు
- టీకన్సల్ట్ చైర్మన్ సందీప్‌కుమార్ మక్తాల వెల్లడి

రాయదుర్గం: టీకన్సల్ట్‌తో సమగ్ర ఆరోగ్య సేవలు అందించటానికి ఆస్కారం లభిస్తుందని టీ కన్సల్ట్ చైర్మన్ సందీప్ కుమార్‌మక్తాల అన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్ ప్రాంగణంలో టీకన్సల్ట్ సమగ్ర ఆరోగ్య కార్యక్రమాని ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా అలోపతి, ఆయుర్వేదం, నేచురోపతి, హోమియోపతి వంటి వివిధ వైద్య పద్ధతులను సమన్వయంగా కలిపి సమగ్ర ఆరోగ్య సేవలు అందించడానికి కృషి చేస్తుందన్నారు. ఇది మెడికల్ టూరిజాన్ని ప్రోత్సహిస్తూ అంతర్జాతీయ రోగులకు భారతీయ సంప్రదాయ వైద్య విధానాల గొప్పతనాన్ని పరిచయం చేయడానికి మంచి అవకాశమన్నారు. భారతీయ సంప్రదాయ వైద్య విధానాలను ప్రపంచానికి అందించడానికి ఇది ఒక మంచి వేదికగా నిలుస్తుందన్నారు. 63 దేశాలకు తమ కార్యకలాపాలను విస్తరించిన టీఐహెచ్‌ఎన్ ప్రపంచ ఆరోగ్య వ్యవస్థలను పునర్ నిర్వహించేందుకు సిద్ధమైందన్నారు. ఈ విశాల దృక్పథానికి మద్దతుగా ఇప్పటికే 100కు పైగా వైద్య నిపుణులు భాగస్వాములయ్యారన్నారు. టీఐహెచ్‌ఎన్ ద్వారా టీకన్సల్ట్ ఆధునిక వైద్యాన్ని భారతీయ సంప్రదాయ వైద్య పద్ధతులతో మిళితం చేస్తూ, రోగులకు సమగ్ర ఆరోగ్య అనుభవాన్ని అందించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమం సమగ్ర ఆరోగ్య సేవల రూపకల్పనలో భారతదేశాన్ని ఆధునిక సంప్రదాయ వైద్య పద్ధతుల నాయకుడిగా నిలిపేందుకు టీకన్సల్ట్ కట్టుబడి ఉందన్నారు. ఈ ప్రణాళిక ద్వారా భారతీయ సంప్రదాయ వైద్య విధానాలను ఆశించే 63 ఇతర దేశాల పౌరులతోపాటు ప్రపంచ వ్యాప్తంగా నివసిస్తున్న భారతీయ పౌరులకు వైద్య సేవలు అందించడంలో డాక్టర్లు, వైద్యనిపుణులకు అంతర్జాతీయ అవగాహనను కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీకన్సల్ట్ బోర్డు డైరెక్టర్లు ఈశ్వర్ కోట, రాజీవ్ రావులపాటి, చల్లా నరేందర్, వంశీతిరున హరి పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సందీప్‌కుమార్ మక్తాల, సభ్యులు

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

ఉస్మానియా వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం సూచించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో రెండురోజుల అంతర్జాతీయ సదస్సును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ పరివర్తన విశేషమైన పరిణామం గురించి, అక్షరాస్యత అడ్డంకులను అధిగమించి సమాజంలోని అన్ని వర్గాలలో దాని పురోగతిని సాధించేలా ముందుకు సాగాలన్నారు. పరిశోధన, ఆవిష్కరణలు, సాంకేతికతతో ముఖ్యంగా కృత్రిమ మేధస్సుతో వ్యవహరించేటప్పుడు అపరిష్కృత సమస్యలపై దృష్టిపెట్టాలని విద్యావేత్తలు, విద్యార్థులకు ఆయన సూచించారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడమే కాకుండా ఆలోచించడం ప్రారంభించాలని కోరారు. 'మనూ'లో వివిధ రంగాలలో చేపట్టే కార్యక్రమాలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం సహకరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. 'మనూ' ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి. ఫజల్ రహమాన్ మాట్లాడుతూ విద్య, పరిశ్రమల మధ్య సహకారాన్ని ప్రోత్సహించడంలో సాంకేతిక ప్రాముఖ్యతను అందరూ గుర్తించాలన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఓయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం

వచ్చే విద్యాసంవత్సరం నుంచి సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ కోర్సు ప్రారంభం

– 'మనూ' రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్

వచ్చే విద్యా సంవత్సరం నుంచి 'మనూ'లో సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ ప్రారంభించబోతున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ ప్రకటించారు. ఇది మల్టీ డిసిప్లినరీ విధానంతో కూడిన కోర్సును స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కింద నిర్వహించబడుతుందన్నారు. ఇంజినీరింగ్‌లో డాటా సైన్స్, కంప్యూటర్ సైన్స్, సమాచార విభాగంలో అంతర్జాతీయ స్థాయి అధ్యాపకులు అందుబాటులో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా 'మనూ' ప్రొఫెసర్లు అబ్దుల్ వాహిద్, ప్రదీప్‌కుమార్, జమీల్ అహ్మద్, అబ్దుల్ ఖయ్యూమ్ అన్సారి, గులామ్‌నబీ, బిస్వజిత్ బ్రహ్మచ ఎం.ఏ.హమీద్, సయ్యద్ ఇంతియాజ్ హసన్ ప్రసంగించారు.

మోటామోవైరస్‌పై భయపడాల్సిన అవసరం లేదు

డాక్టర్ కిషన్ శ్రీకాంత్ స్పష్టీకరణ

రాయదుర్గం: మోటామోవైరస్ (హెచ్‌ఎంపీవీ) అనేది ఒక శ్వాసకోశ వైరస్ అని దీనిపై భయపడాల్సిన అవసరం లేదని నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని స్టార్ ఆస్పత్రి కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ కిషన్ శ్రీకాంత్ వెల్లడించారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ ఇది ఇటీవలి కాలంలో ప్రపంచ దృష్టిని ఆకర్షించిందన్నారు. ఇది చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిని ఎక్కువగా ప్రభావితం చేస్తుందన్నారు. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడం, అవగాహన పెంచుకోవడం చాలా అవసరమన్నారు. ఈ శ్వాసకోశ వైరస్‌ను డచ్ పరిశోధకులు 2001లోనే తొలిసారిగా గుర్తించారని గుర్తుచేశారు. సాధారణ జలుబు, ఫ్లూ వంటి ఇతర శ్వాసకోశ వ్యాధుల మాదిరిగానే లక్షణాలు ఉంటాయన్నారు.

ప్రతి ఒక్కరూ ఈ వ్యాధి పట్ల అవగాహన ఏర్పాటు చేసుకొని ముందు జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి సమస్యలు ఉత్పన్నం అయ్యే అవకాశాలు చాలా తక్కువని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల తగిన ముందు జాగ్రత్తలు పాటించడమే కాకుండా వాకింగ్, యోగా, మెడిటేషన్ వంటివి చేయాల్సిన అవసరం కూడా ఉందని ఆయన గుర్తు చేశారు.

నిజాయితీని చాటుకున్న కండక్టర్

మర్చిపోయిన బ్యాగు అందజేత

మియాపూర్: ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికురాలు బ్యాగును వదిలివెళ్లగా కండక్టర్ సదరు మహిళకు బ్యాగును అందజేసి తన నిజాయితీని చాటుకున్నాడు. వివరాల్లోకి వెళితే... ఈనెల 2వ తేదీన మియాపూర్ ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఉష మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు మియాపూర్ 2–డిపో బస్సులో ప్రయాణించింది. ఇస్నాపూర్‌లో దిగే సమయంలో ఆమె బ్యాగును బస్సులోనే మర్చిపోయింది. కొంతదూరం వెళ్లాక కండక్టర్ కుమార్ బ్యాగును గమనించాడు. అనంతరం ఆ బ్యాగును డిపో అధికారులకు అందజేశాడు. బ్యాగులో రూ.10.80 వేల నగదు, 5 గ్రాముల బంగారం, ఇతర కార్డులున్నాయి. ఆర్టీసీ అధికారులు ఉష సమాచారం కనుగొని గురువారం డిపో మేనేజర్ వెంకటేషం కండక్టర్ కుమార్, ఇతర అధికారులతో కలిసి ఆమకు బ్యాగును అందజేశారు. నిజాయితీని చాటుకున్న కుమార్‌ను డిపో మేనేజర్, ఇతర అధికారులు, సిబ్బంది శాలువా కప్పి అభినందించారు.



బ్యాగును ప్రయాణికురాలు ఉషకు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు